

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

నల్గొండ
యాదాద్రి
సూర్యాపేట

మంగళవారం 27, మే 2025 పేజీలు - 8


# కబ్జా కోరల్లో చిక్కుకున్న దిర్శించర్ల ఊర చెరువు

- ఇటుక బట్టీల వద్ద భారీ చెరువు మట్టి డంపు
- కాసులు కురిపిస్తున్న చెరువు మట్టి
- వ్యాపార కేంద్రంగా మారిన చెరువు
- అక్రమార్కులకు రాజకీయ అండదండలు
- రాజకీయ ఒత్తిడితో ఏం చేయలేని అధికారులు







నేరేడుచర్ల, మేజర్‌న్యూస్ ః గ్రామాలలో ప్రధాన నీటి వనరులుగా వర్ధిల్లుతున్న చెరువులను స్వార్ధపరులు చెర పట్టిస్తున్నారు. చెరువులు గ్రామాలలో మినీ ప్రాజెక్టులుగా సాగు, తాగు నీరు అందించడంతో పాటు మత్స్య సంపద పెంచి ఎంతో మందికి జీవనోపాధి కల్పిస్తున్నాయి. చెరువు శిఖం భూములు కబ్జాకు గురవుతున్న అధికార యంత్రాంగం మొద్దు నిద్రలో జోగుతుందని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని దిర్శించర్ల ఊర చెరువును చుట్టు పక్కల రైతులు కబ్జా చేస్తున్నారని, చెరువు మట్టిని అనుమతులు లేకుండా వ్యాపారపరంగా ఇటుక బట్టీలకు అమ్మి కాసుల పోగు చేసుకుంటున్నారు. రెవిన్యూ, నీటిపారుదల అధికారులకు ఫిర్యాదు చేసిన నామమాత్రంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించిన ఆక్రమణ కొనసాగుతూనే ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆక్రమణకు గురవుతున్న దిర్శించర్ల ఊర చెరువు విషయంపై చెరువు మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పంగ నాగరాజు హైకోర్టుకు వెళ్లగా చెరువు శిఖం భూమిని ఆక్రమించిన రైతులకు నోటీసులు ఇచ్చి భూమిని స్వాధీనం చేసుకోవాలని అధికారులను కోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను సంబంధిత అధికారులు అమలు చేయడంలో జాప్యం చేస్తున్నారని మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పంగ నాగరాజు విచారం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకుని మిగతా 3లో

## 22 ఆరోగ్య ఉప కేంద్రాలకు తక్షణమే స్థలాలను కేటాయించాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



*నల్గొండ జిల్లా బ్యూరో*

జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా జిల్లాకు మంజూరైన 22 ఆరోగ్య ఉప కేంద్రాలకు తక్షణమే స్థలాలను కేటాయించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద నూతనంగా మంజూరైన 22 ఆరోగ్య ఉప కేంద్రాలు, గతంలో మంజూరై పనులు మొదలుపెట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల పురోగతి పై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారం రోజుల్లో 22 నూతన సబ్ సెంటర్‌లకు స్థలాలను గుర్తించి కేటాయించాలని, ఇందుకు తక్షణమే ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ఈ విషయానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. గతంలో జిల్లాకు జాతీయ ఆరోగ్య మిషన్ కింద 164 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, ఆసుపత్రులు మంజూరు కాగా, వాటిలో 143 భవనాల నిర్మాణాలు ప్రారంభమై వివిధ స్థాయిలలో మిగతా 3లో

## పోలీసు గ్రీవెన్స్ డేలో పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ



*నల్గొండ జిల్లా బ్యూరో*

ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 45 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని, పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలని అన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కటినంగా వ్యవహరించాలని అన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని

## సర్వేయర్లు సద్వినియోగం చేసుకోవాలి

– కలెక్టర్ హనుమంతరావు

వివరాలు 8లో

సూర్య



## బాల కార్మిక నిర్మూలన కోసం అలుపెరుగని పోరాటం చేసిన సామాజిక కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం





నూతనకల్, మేజర్‌న్యూస్ : పిల్లలందరూ బడిలో ఉన్నప్పుడే జ్ఞానవంతులుగా తీర్చిదిద్దబడి తమ హక్కులను పొందుతారని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు, ఎంవి ఫౌండేషన్ జాతీయ కోఆర్డినేటర్ ఆర్.వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉమాదేవి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఎంవీ ఫౌండేషన్ సామాజిక కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల కార్మిక నిర్మూలన కోసం ఈ ప్రాంతంలో అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించామని, పిల్లలు బడిలో ఉండాలనే రాజీలేని సిద్ధాంతంతో అలుపెరుగని పోరాటం చేశామని తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలన కోసం కార్యకర్తలు ప్రతి గ్రామంలో కళాబృందంగా ఏర్పడి వీధి నాటకాలు ప్రదర్శించి ప్రజలలో చైతన్యం నింపి గ్రామస్తుల, అధికారుల సహకారంతో బాల్యవివాహాల నిలుపుదల చేశారని తెలిపారు. బాలల హక్కుల కోసం ఈ ప్రాంతంలో జరిగిన చైతన్య కార్యక్రమాలను వివిధ ప్రాంతాలలో అమలు చేశామని తెలిపారు.ఎంవీ ఫౌండేషన్ మాజీ జిల్లా కోఆర్డినేటర్ ఇ.వెంకటేష్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం యువత పాదయాత్రలు చేసి పిల్లలు ఉండాల్సిన సరైన చోటు పాఠశాలలే అని,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో,బడిలో పిల్లలు ఉన్నప్పుడే పేదరికం పోతుంది అని నమ్మి ప్రజలను చైతన్యవంతం చేయడంలో కార్యకర్తలు చేసిన కృషి అమోఘమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మాజీ మండల కోఆర్డినేటర్ పి.రామచంద్రయ్య, చిప్పలపెల్లి రవి, రాంపాక విజయ్ కుమార్, దండ సరేందర్ రెడ్డి, సురారపు వెంకన్న, రాజు, అంజయ్య, దామోదర్ నాయక్, చైతన్య, రుజీనా, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు హద్దులను నిర్ణయించి కంచె ఏర్పాటు చేయాలి

మోత్కూర్, మేజర్‌న్యూస్ : మోత్కూర్ మున్సిపాలిటీలోని పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌ల హద్దులను గుర్తించి కంచె ఏర్పాటు చేయాలని బిజెపి మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి ఇట్టి విషయం పై వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని పెద్ద చెరువులో అక్రమ కట్టడాలు హద్దు, అదుపు లేకుండా నిర్మిస్తున్నారని, రియల్ ఎస్టేట్ దారులు చెరువును కబ్జా చేస్తున్నా అధికారులు పట్టి పట్టనట్లు మామూళ్ల మత్తులో పడి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో చెరువు మాయమయ్యే పరిస్థితి వస్తుందని, ప్రజలు తీవ్ర నీటి కష్టాలు ఎదుర్కొనక తప్పదని ఆందోళన వెలిబుచ్చారు. దీనిపై వెంటనే అధికారులు స్పందించి చెరువు హద్దులు నిర్ణయించి కంచె ఏర్పాటు చేయాలని కోరగా అడిషనల్ కలెక్టర్ వెంటనే స్పందించి సూర్యాపేట ఇరిగేషన్ శాఖకు పంపించి విచారణ చేయించి హద్దులు ఏర్పాటు చేయుటకు సంబంధిత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట జలాల్ ఉన్నారు.



## ఘనంగా ఉజ్జిని అనిల్ రావు జన్మదిన వేడుకలు



చండూర్, మేజర్‌న్యూస్ : మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ చండూర్ మండల పార్టీ యువజన అధ్యక్షులు ఉజ్జని అనిల్ రావు జన్మదినం సందర్భంగా తుమ్మలపల్లి శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేకంగా అర్చనలు పూజలు నిర్వహించడం జరిగింది. తదనంతరం ప్రభుత్వ హాస్పిటల్లో గర్భిణీ స్త్రీలకు, వృద్ధులకు అనార్థులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు కురుపాటి సుదర్శన్, గుండ్రపల్లి గ్రామ శాఖ యూత్ అధ్యక్షులు కురుపాటి లింగస్వామి, బోడంగిపర్తి యూత్ అధ్యక్షుడు కట్కూరి మహేష్, దాసరి కోటేష్, ఆంజనేయులు, ఎలవర్తి జగన్, గుండెల శ్రవణ్, అనిల్, శంకర్, జగన్, మహేష్, స్వామి, ప్రభు పాల్గొన్నారు.

## గణపవరంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్



కోదాడ, మేజర్‌న్యూస్ : దేశ ప్రజలకు సమాన హక్కులు, సమాన న్యాయం కల్పించాల్సిన బిజెపి ప్రభుత్వ పాలకులు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను కాల రాస్తున్నారని కోదాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్ రెడ్డి విమర్శించారు. సోమవారం కోదాడ మండల పరిధిలోని ఘనపూర్ గ్రామం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు జరిగిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి బిజెపి పాలకులు తీరు తీవ్ర ఆపేక్షనీయంగా ఉంది అని, కట్టు బొట్టు తిండి పూజ అన్నిటి పైన ఆంక్షలు పెడుతూ ప్రజా హక్కులను భంగం కలిగిస్తున్నారు అని, ఇలాంటి తరుణంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడు పైన ఉన్నది అన్నారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణ కులం కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇర్ల సీతా రామిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు జాబి శెట్టి నాగ ప్రసాద్,బండి చినకోటయ్య,పాపి శెట్టి సత్యం, సుభాష్ రెడ్డి, మౌలానా, బండి సైదులు, ముడియాల నాగిరెడ్డి, పుప్పాల రంజిత్, ఎస్.కే.బి.ఖన్, కత్తి సత్యం, బండి సత్యం, డాక్టర్ ఖదీర్, ఎస్.కె.నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

కోదాడ, మేజర్‌న్యూస్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోదాడ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పిల్లుట్ల శ్రీనివాస్, బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లామ్ దేవరాజ్‌లు అన్నారు. కోదాడ పట్టణంలోని స్థానిక సీసీ రెడ్డి పాఠశాలలో కోదాడ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలను వారు ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే క్రీడ కోటాలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు అన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన పోటీలలో ప్రథమ స్థానంలో నల్గొండ జట్టు, ద్వితీయ స్థానంలో కోదాడ జట్టు, తృతీయ స్థానంలో హుజూర్నగర్ జట్టులు నిలిచాయి. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు మెమొంటోలతో పాటు మెడల్స్ ను అందించారు. ఈ కార్యక్రమంలో దాత కందుల చంద్రశేఖర్,




ఫాదర్ తుమ్మ జోసెఫ్ రెడ్డి, బొలిశెట్టి రాము, ఎబినేజర్, వినయ్ భాస్కర్, హేమంత్ సాయి, అర్జున్, గోపి, రామన్న, బాస్కెట్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## తెలంగాణ పౌరస్పందన వేదిక ప్రచార జాతకు కోదాడలో ఘన స్వాగతం



కోదాడ, మేజర్‌న్యూస్ : తెలంగాణ చదువుల్లో మార్పులు రావాలని తెలంగాణ పౌర స్పందన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో విద్యా వైద్యం ప్రభుత్వ బాధ్యత అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రచార జాత కోదాడకు చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్య తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. ప్రభుత్వం సమూలమైన మార్పులతో తగు చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వ బడులు నిలబడతాయి అన్నారు. ప్రభుత్వ బడులు నిలబడాలంటే చదువుల్లో అంతరాలు పోవాలని, ఉన్నోడి పిల్లలైనా లేనోడి పిల్లలైనా ఒకే బడిలో చదవాలన్నారు. అంతరాలు లేని చదువుకై అందరూ మాట్లాడాలని పిలుపునిచ్చారు. పౌర స్పందన వేదిక ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు కృషి చేస్తుందని అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రచార జాత ద్వారా ప్రజలకు చైతన్యం కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా నేడు నల్గొండ నుండి బయలుదేరిన యాత్ర నకిరేకల్, సూర్యాపేట కోదాడ డివిజన్లకు చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో పౌర స్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేవీ.మంగ, జిల్లా అధ్యక్షులు ఆర్.ధనమూర్తి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, కోదాడ మాజీ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బుర్ర సుధారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి వి వెంకటరమణ, టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఎన్.నాగేశ్వరరావు, పాండురంగ చారి, జిల్లా టీఎస్ యుటిఎఫ్ డివిజన్ బాధ్యులు ఆంజనేయులు, బాబు, వెంకటేశ్వర్ రెడ్డి, బచ్చయ్య, మోతిలాల్, ఖాజామీయా, మైసయ్య, సైదిరెడ్డి, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కర్మకు హాజరై నివాళులర్పించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సీఎం రేవంత్ రెడ్డి చిన్న మామ వేదిరే మధుసూదన్ రెడ్డి ఇటీవల మృతి చెందారు. సోమవారం ధశదిన కర్మ కార్యాక్రమములో అయన నివాసంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు హాజరై వెదిరే మధుసుధన్ రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించినారు. అనంతరం అయన కుమారులు వేదిరే శ్రీనివాస్ రెడ్డి,వేదిరే పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వేదిరే మేఘా రెడ్డి, వేదిరే విజంధర్ రెడ్డిలను ప్రమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా వర్గ సభ్యులు గురిజ రామచంద్రం, సిపిఐ కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి,మండల కార్యదర్శి చాపల శ్రీను, బోల్గురి నరసింహ, బొమ్మరబోయిన లాలు,ఉప్పునూతల రమేష్, డోకూరి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కబ్జా కోరల్లో చిక్కుకున్న దిర్శించర్ల ఊర చెరువు

(మొదటిపేజీ తరువాయి)

ఆక్రమణకు గురైన శిఖం భూమిని స్వాధీనపర్చుకోవాలని ఆయన కోరారు. దిర్శించర్ల గ్రామ ఊర చెరువు విస్తీర్ణము సర్వేనెం.52లో 116.26 ఎకరాలు ఉండగా, ప్రస్తుతం అందులో మూడో వంతు కూడా లేదని రైతులు తెలిపారు. సుమారు 150 ఎకరాలకు పైగా సాగు నీరు అందించే ఈ చె రువును కొంత మంది స్వార్ధపరులు వ్యాపార కేంద్రంగా మార్చుకున్నారు. భూసారం పెంచడానికి రైతులకు పొలాలకు వెళ్లాల్సిన సారవంత మైన నల్లమట్టిని జేసీబీలతో ట్రాక్టర్లకు ఎక్కించి కాసుల కోసం ఇటుక బట్టీలకు అమ్మటం విచారకరమన్నారు. రైతులు ఫిర్యాదు చేసినప్పుడు రెవిన్యూ,నీటిపారుదలశాఖ అధికారులు హడావుడిగా చెరువును సర్వేచేసి హద్దులు పెట్టి వెళ్తున్నారు. వారు వెళ్లడమే ఆలస్యం చెరువు మట్టి పోసి శిఖమును చదును చేసుకుని కబ్జా చేస్తున్నారు. అధికారులు రక్షణ చర్యలు చేపట్టకపోవడం వలన చెరువులు అన్యాక్రాంతం అవుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. ఇటీవల దిర్శించర్ల గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘ చైర్మన్ పంగ నాగరాజు అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చినప్పటికి ఆక్రమణకు గురైన శిఖం భూమిని స్వాధీనం చేసుకుని హద్దులు నిర్ణయించడంతో విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. రాజకీయ అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని, రాజకీయ ఒత్తిళ్లకు అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇటుక బట్టీల పక్కన రోడ్డుకు ఇరువైపుల భారీ స్థాయిలో చెరువు మట్టి డంప్ చేసి ఉంచారు. అధికారులకు మాత్రం అవి ఏవి కనిపించడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

**తహసీల్దార్ సైదులు వివరణ...**

చెరువు శిఖం భూమిని ఆక్రమించిన రైతులకు కోర్టు ఆదేశాల మేరకు నోటీసులు జారిచేశామని, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**నీటిపారుదలశాఖ డీఈ అమరేందర్‌రెడ్డి వివరణ :** రెవిన్యూ అధికారులతో సర్వే చేయించామని, శిఖం భూమిని ఆక్రమించిన రైతుల వివరాలు తహసీల్దార్‌కు పంపించామని వారు హద్దులు ఏర్పాటు చేస్తే రక్షణ చర్యలు చేపడుతామన్నారు.

**చెరువును కాపాడాలి**

**– దిర్శించర్ల గ్రామ మత్స్య పారిశ్రామిక సంఘం చైర్మన్ పంగ నాగరాజు**

చెరువును మట్టిని అక్రమంగా తరలించడం, శిఖం భూమిని కొంత మంది రైతులు మట్టిపోసి అక్రమంగా సేద్యం చే స్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎంతో మందికి జీవనోపాధి కల్పిస్తున్న చెరువును కాపాడాలని, హైకోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేయాలని ఆయన కోరారు.

# 22 ఆరోగ్య ఉప కేంద్రాలకు తక్షణమే స్థలాలను కేటాయించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. నిర్మాణంలో ఉన్న భవనాలన్నింటిని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంకా పనులు మొదలుపెట్టని 21 భవనాలకు పనులు తక్షణమే ప్రారంభించాలని చెప్పారు. దీంతోపాటు, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ఆసుపత్రులను త్వరితగతిన ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిసిహెచ్ఎస్ మాతృనాయక్, సూపరింటెండెంట్ ఇంజనీర్ రామచంద్రారెడ్డి, ఉప వైద్య ఆరోగ్య అధికారులు, టిఎస్ ఎంఐడిసి ఇంజనీరింగ్ అధికారులు, డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# మొదటి పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్న కంకణాల వెంకట్ రెడ్డి

చింతపల్లి, మేజర్‌న్యూస్ : చింతపల్లి మండలం గొల్లపల్లి విరాట్‌నగర్ కాలనీకి చెందిన సంకోజు ఈశ్వరయ్య-అంజమ్మ, శ్యామ్ కావ్య కుమారుడు బుబ్బు మొదటి పుట్టినరోజు వేడుకలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల. వెంకట్ రెడ్డి హాజరై చిరంజీవిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ దార్ల విశ్వనాథం, దార్ల రవీంద్ర చారి, మాణిక్యం, బ్రహ్మం, లింగ బ్రహ్మచారి, వీర బ్రహ్మం, రాజశేఖర్, సంకోజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# తక్కల్లపెల్లి గ్రామంలో వైభవంగా బోనాలు





చింతపల్లి, మేజర్‌న్యూస్ : చింతపల్లి మండలం తక్కల్లపల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గుండ్లపల్లి అనిత నర్సింహారెడ్డి, మాజీ ఎంపిటిసి పొగాకు శ్రీశైలం గ్రామ పెద్దలు పోతగోని రామస్వామి గౌడ్, యువకులు శిరసావాడ జగన్, పందుల జగదీష్ గౌడ్, పుప్పాల నరేష్, కరుణాకర్, యాదయ్య, స్వామి యువకులు, వందలాది మంది మహిళలు తదితరులు పాల్గొన్నారు. తక్కల్లపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా మడేల్ అయ్యా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు

## టీబీ రహిత తెలంగాణ కై కృషి



చింతపల్లి, మేజర్‌న్యూస్ : టీబీ ముఖ్త్ భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమములో భాగంగా చింతపల్లి గ్రామపరిధిలో అవగాహన స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించడము జరిగిందని చింతపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి అన్నారు. సోమవారం చింతపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కొంతమందికి పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది, మహిళలు, చిన్నారులు ఉన్నారు.

# ఆర్థిక సాయం అందజేసిన ఏజేఆర్

వలిగొండ, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని పహిల్వాన్ పూర్ గ్రామం మధిర పల్లెంపు గ్రామానికి చెందిన మద్ది అరుణమ్మ ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందింది మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ఏజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎలిమినేటి జంగారెడ్డి ఏర్పాటు చేసిన 10000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గూడూరు నరసింహ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేయడం జరిగింది.

# మాదరబోయిన పిచ్చమ్మకు నివాళులు



చిట్యాల, మేజర్‌న్యూస్ : సిపిఎం చిట్యాల మండల కమిటీ సభ్యులు మాదరబోయిన వెంకన్న తల్లి పిచ్చమ్మ (78)అనారోగ్యం కారణంగా మరణించటం పట్ల సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్యలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలోని వెంకటాపురంకు చెందిన మాదరబోయిన పిచ్చమ్మ ఆదివారం నాడు సాయంత్రం మృతి చెందడంతో సిపిఎం మండల మండల బృందంతో కలిసి సోమవారం ఇంటికి వెళ్ళి, ఆమె భౌతిక కాయం పై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.పిచ్చమ్మకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఐతరాజు నర్సింహా, కందగట్ల గణేష్, ఐతరాజు యాదయ్య, కల్లూరి లక్ష్మయ్య,అవిశెట్టి నర్సింహా, చిర్రబోయిన గట్టయ్య,కొమిడాల గోపాల్ రెడ్డి, కిరణ్, సత్తయ్య పాల్గొన్నారు.

# చల్లూరులో వైభవోపేతంగా బీరప్ప పండుగ వేడుకలు

## కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొన్న బీసీ నేత జూకంటి



రాజపేట, మేజర్‌న్యూస్ : రాజపేట మండలం చల్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న బీరప్ప, అక్క మహంకాళి, చౌడాలమ్మ కళ్యాణ మహోత్సవం సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్, కురుమ సంఘం రాజపేట మండల అధ్యక్షుడు వస్పరి సుధాకర్, యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కవిడే మహేందర్, సీనియర్ జర్నలిస్టు మీస వెంకటేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లూరు కురుమ సంఘం నాయకులు చెట్కూరి కుమార్, మీస బాల మల్లయ్య, బింగి కర్ణాకర్, దిడ్డిగా రమేష్, కురుమ కుల పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏకరూప దుస్తుల పంపిణీ

హుజూర్‌నగర్ రూరల్, మేజర్‌న్యూస్ ః మండలంలోని 15 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం నుండి మంజూరు చేయబడిన 872 ఏకరూప దుస్తులను సోమవారం ఎంపిడివో కార్యాలయం నందు ఎంపిడివో లావణ్య, ఏపిఎం స్వరూపరాణిలు మండలంలోని హెచ్ఎంలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిసి పరిమళ, హెచ్ఎంలు వెంకటేశ్వరరావు, కళింగరెడ్డి, ధనలక్ష్మి, గోవిందు పాల్గొన్నారు.



సూర్య
27-05-2025 మంగళవారం

# వైభవంగా శ్రీ స్వర్ణగిరీశుడి నిత్య కళ్యాణం మహోత్సవం



భువనగిరి, మేజర్‌న్యూస్ : ఉదయం 10:30 లకు జగదేక చక్రవర్తి అయిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సువర్ణభరిత వజ్రాభరణాలతో, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి విశిష్ట కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణమహోత్సవాన్ని తిలకిస్తూ దివ్యానుభూతిని పొందారు. సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

# సివిల్ సప్లై హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

## – ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్



హుజూర్‌నగర్ రూరల్, మేజర్‌న్యూస్ ః సివిల్ సప్లై హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏఐటియూసి అనుబంధ సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో కూడా సివిల్ సప్లై హమాలీ కార్మికులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజా పంపిణీ వ్యవస్థను ఆపకుండా పనిచేసినార న్నారు. ప్రస్తుతం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలల కోటా బియ్యాన్ని ఒకే నెలలో ప్రజలకు ఇవ్వాలన్న అధికారుల ఆదేశాలను పాటిస్తూ ఎండాకాలం అయిన కూడా పనిచేస్తున్నారన్నారు. సివిల్ సప్లై హమాలీ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం, ఈఎస్ఐ,పిఎఫ్ అమలు చేయాలని, ప్రతి కార్మికుడికి రూ.5వేల ఫించన్ కల్పించాలని, అర్హులైన కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు,ఆహార భద్రతా కార్డులు ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో గొల్లగోపు మల్లయ్య,బెల్లంకొండ రామ్మూర్తి, బాణావత్ సైదులు, పండగ వెంకన్న, జక్కుల మల్లయ్య, పానుగోతు గోపి, ఎర్ర బాలాజీ, బాణావత్ భిక్షం, చక్రాల వెంకన్న, లకావత్ కృష్ణ పాల్గొన్నారు.

# ఎల్ఓసి ఒక వరం లాంటిది

తుర్కపల్లి, మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పేద కుటుంబాలకు ఒక వరం లాంటిదని, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పనగట్ల సుదర్శన్ గౌడ్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన పనగట్ల వెంకటేశంకు నీమ్స్ హాస్పిటల్‌లో బ్రెయిన్ సర్జరీ అవసరం కోసం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో రెండు లక్షల 50 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధిని మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకరి శెట్టియ్య, పలుగుల శ్రీనివాస్, ఒగ్గు కృష్ణ, గడ్డమీది నిఖిల్, శివ, ఇంద్ర పాల బాలకృష్ణ, యాట పెంటయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# సత్యనారాయణ స్వామి వ్రతానికి హాజరైన ప్రముఖ నాయకులు



నాగార్జునసాగర్, మేజర్‌న్యూస్ : నాగార్జునసాగర్ హిల్ కాలనిలో గోదావర్తి రాజా ప్రసాద్ కుమారుడు నందకిషోర్–శ్రావణి వివాహ కార్యక్రమంలో భాగంగా నేడు సత్యనారాయణ స్వామి వ్రతానికి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించినా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానా రెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్ రెడ్డి, లక్ష్మ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఉంగరాల శీను, హరి, దినేష్ నాయక్, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సాయిగోపి జన్మదిన సందర్భంగా అన్న వితరణ



మునగాల, మేజర్‌న్యూస్ : మునగాలమండలపరిధిలోని ముకుందాపురం గ్రామం లో ఉన్న ఇందిరాఅనాథ వృద్ధాశ్రమంలో, జగ్గయ్యపేట వాస్తవ్యులు పచ్చిపాల సాయిగోపి, జన్మదినం సందర్భంగా ఆశ్రమంలో ఉన్న అనాథలకు వృద్ధులకు మానసిక వికలాంగులకు వారిఆధ్వర్యంలో అన్నదానకార్యక్రమం, స్వీట్లుపంపిణీ చేసి ఈసందర్భంగా 20 లీటర్ల రైస్ కుక్కర్, ఎలక్ట్రికల్ స్టవ్‌లను సుమారుగా 18 వేల విలువగల వస్తువులను సోమవారం ఆశ్రమానికిఅందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాపుట్టినరోజు వివాహవార్షికోత్సవాలు. అలాగే వారి వారిగృ హాలలో జరిగే వివిధ కార్యక్రమాలసందర్భంగాఇలా ఆశ్రమాలలో అన్నదానం చేయడం. పుణ్యకార్యం అని ప్రతిఒక్కరు స్పందించి ఇలాంటి ఆశ్రమాలకు ఇలాంటి అన్నదానకార్యక్రమాలతో పాటు ఎవరికి తోచిన విధంగా వారు. నిత్యావసర వస్తువులు కూరగాయలు ఆశ్రమానికి కావాల్సిన వివిధ గృహపకరణ వస్తువులతో పాటు వారికి తోచిన విధంగా ఆర్థిక సహాయ సహకారాలు అందించిఅండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పచ్చిపాల సాయి గోపి, వారి సతీమణి శ్రీ బిందు, ఆశ్రమం నిర్వాహకులు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి, తదితరులుపాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి చెస్‌కి ఎంపికైన శ్యాముల్



మునగాల, మేజర్‌న్యూస్ : మునగాల మండల పరిధిలోని తాడువాయి గ్రామానికి చెందిన జిల్లేపల్లి లింగయ్య నాగేంద్ర కుమారుడు జిల్లెపల్లి శ్యాముల్ రాష్ట్రస్థాయి అండర్ 13 చెస్ ఛాంపియన్ కు సెలక్షన్ ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ సెలక్షన్స్ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన చెస్ ఛాంపియన్స్‌లో అండర్ 13లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి అండర్ 13కి ఎంపిక కావటం జరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన జిల్లెపల్లి శ్యాముల్ రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌కి ఎంపిక కావడం గర్వంగా ఉందని తాడువాయి గ్రామానికి చెస్‌లో గుర్తింపు తెచ్చినందుకు తల్లిదండ్రులు గ్రామ పెద్దలు సోమవారం అభినందించారు.

# కుమారి సిపిఎం పార్టీకి చేసిన సేవలు మరువలేనివి



మునగాల, మేజర్‌న్యూస్ : మునగాల మండలం పరిధిలోని కొక్కిరేణి గ్రామం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ ములకలపల్లి రాములు సతీమణి ములకలపల్లి కుమారి చిత్రపటానికి పూలమాలవేసి సోమవారం నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్లపాటి శ్రీనివాసరావు ఆయన వెంట గోవర్ధన్, రవి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి కుమారి సిపిఎం పార్టీకి చేసిన సేవలు మరువలేనివని



సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములకలపల్లి రాములు పార్టీ నాయకుడిగా ఎరగడంలో కుమారి పాత్ర మరువలేనిది అన్నారు. పార్టీ నాయకుడిగా, ప్రజా ప్రతినిధిగా తన భర్త రాములు ఎన్నికై ప్రజాసేవలో ఉన్నప్పుడు ఆమె ఎంతో ఓపికగా ఉంటూ అన్ని విధాలుగా ఆయనకు సహకరించిందన్నారు. ఇంటికి వచ్చే నాయకులకు, కార్యకర్తలను ఆప్యాయతగా పలకరిస్తూ వారికి భోజనాలు పెట్టే వారన్నారు. చనిపోయేంతవరకు పార్టీ సభ్యురాలుగా కొనసాగారని, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘాలకు సహాయ సహకారాలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ జంపాల స్వరాజ్యం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆరే రామకృష్ణారెడ్డి, సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి నందిగామసైదులు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ ఎరువులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

## మండల వ్యవసాయ అధికారి ఎస్.పద్మజ



మునుగోడు, మేజర్ న్యూస్ : సేంద్రీయ ఎరువులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించండి అని మండల వ్యవసాయ అధికారి ఎస్. పద్మజ రైతులకు సూచించారు. సోమవారం మునుగోడు మండల కేంద్రంలోని రైతు వేదికలో సహజ, సేంద్రియ పద్ధతిలో పంటలను పండించడం పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సహజ ఎరువులు వేసి పంటలు వేసే విధానంపై రైతులకు ఆహాగాహన కల్పించారు. అనంతరం ఏడిఏ బి.వేణుగోపాల్ మాట్లాడుతూ పంట మార్పిడి ద్వారా సహజ ఎరువులు వేసి సారవంతమైన భూమిని అభివృద్ధి చేసుకుని పంట ఖర్చు తగ్గించుకొని దిగుబడి పెంచుకునే ప్రయత్నం చేయాలనీ రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు నరసింహ గౌడ్, యాదగిరి, నిఖిల్ మునుగోడు మండల రైతులు నరసింహారెడ్డి, జక్కల వెంకటేష్, మల్ల యాదయ్య, నరసింహ, యాదయ్య, ఎఫ్.పి.ఓ. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# బెల్లి లలితక్కకు ఘన నివాళులు



మోత్కూర్, మేజర్‌న్యూస్ : మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ఆటపాటలతో తెలంగాణ భావజాలానీ ఊరురా వ్యాప్తి చేసి ప్రజలని చైతన్య పరచి, తెలంగాణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసి ప్రాణాలు అర్పించిన లేడి గద్దర్, తెలంగాణ గాన కోకిల బెల్లి లలిత అక్క 26 వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘన నివాళులర్పించారు. బెల్లి లలితక్క అక్క కుమారుడైన శ్రీరామ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పైళ్ళ సోమిరెడ్డి, గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి కారుపోతుల వెంకన్న గౌడ్, మాజీ కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, బొడ్డుపెల్లి కళ్యాణ్ చక్రవర్తి, మార్కెట్ డైరెక్టర్లు సమీరుద్దీన్,పన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఎండి అయాజ్, ఎండి షాకీర్, మెంట నాగేష్, అవిశెట్టి కిరణ్, నిమ్మల శ్రీను, ఎడ్ల శ్రీనివాస్, లింగయ్య, రాములు, బాబర్, మధు, నర్సింహ, వెంకన్న, వెంకట్ రెడ్డి, నరేష్, శివ, సాయి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



**వలిగొండ :** జిల్లా కేంద్రంలో సోమవారం తెలంగాణ ఉద్యమ గాన కోకిల బెల్లి లలితక్క 26వ వర్ధంతి వేడుకలను టియుజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెందిన టీజేఏసీ జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బెల్లి లలితక్క ఆట పాటలతో ప్రజలను ఉద్యమం వైపు మళ్ళించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఏర్పాట్లు బెల్లి లలితక్క పాత్ర మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లీ లలితక్క కుమారుడు సూర్యం ఉద్యమ కళాకారుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డోలక్ యాదగిరి టియుజెఏసి మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాకారం లావణ్య. యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు చేర్యాల సుగుణమ్మ చంద్రకళ అనురాధ కొత్త లలిత గంగిరాజు తదితరులు పాల్గొన్నారు.

**భువనగిరి :** ప్రజాసంఘాల అద్వర్యంలో ఘనంగా తెలంగాణ మలిదశ ఉద్యమ



గానకోకిల బెల్లి లలితక్క 26వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ఆట పాటలతో తెలంగాణ భావజాలన్నీ ఊరురా వ్యాప్తి చేసి ప్రజలని చైతన్య పరచి, తెలంగాణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసి ప్రాణాలు అర్పించి లేడి గద్దర్‌గా, తెలంగాణ గాన కోకిలగా మనందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మన బెల్లి లలితక్కని స్మరించుకున్నాము. ఆమె ఆట, పాట, పోరాటం, త్యాగం మనకు ఎప్పటికీ స్ఫూర్తినిస్తూనే రాష్ట్రంలో గుట్కా సారా నిషేధించాలని అప్పుడే ఆ ఆత్మ శాంతి చేకూర్చాలనీ ఉందని అలాగే భువనగిరిలో మరియు ట్యాంక్ బండిపై విగ్రహం పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లలితక్క కుమారుడు సూర్య ప్రకాష్, పైళ్ల శేఖర్ రెడ్డి, క్యామ మల్లేష్, పోతం శెట్టి వెంకటేశ్వర్లు, బీరు మల్లయ్య, రాజారాం యాదవ్, కొనపురి కవిత, మేక లలిత, తంగలపల్లి రవి, బెల్లి చంద్రశేఖర్, ప్రమోద్,బట్టు రాంచంద్రయ్య, కిరణ్, వాసు కే యాదవ్, వెన్నెల, బత్తుల సిదేశ్వర్, బోనగిరి శ్రీనివాస్, పుట్ట వీరేష్, గుండెబోయిన సురేష్, నక్కల చిరంజీవి, మహేష్ యాదవ్ పవన్, అయోధ్య రచ్చ శ్రీను అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**మోత్కూర్ :** తెలంగాణ గాన కోకిల బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బెల్లి లలిత



సేవలు చిరస్మరణీయమని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం మోత్కూర్‌లోని శ్రీకాంత్ చౌరస్తా వద్ద బెల్లి లలిత 26వ వర్ధంతి సందర్భంగా బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బెల్లి లలిత తన చిన్నతనం నుంచే ఉద్యమాల లక్షణాలను అలవర్చుకొని స్వరాష్ట్ర సాధన కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తన ఆటపాటలతో ప్రజలను చైతన్యం చేసిన గొప్ప వ్యక్తి బెల్లి లలిత నేనని అన్నారు. రాష్ట్ర సాధన కోసం దగాపడ్డ తెలంగాణ పేరుతో 1996లో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో సభ నిర్వహించి మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన ఆమె ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్ నేత, మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి, బెల్లి లలిత సోదరి కుమారుడు శ్రీరామ్ మురళీకృష్ణ, స్థానిక నాయకులు రెడ్డబోయిన కొమరయ్య, తొట్ల సాయికుమార్, మంటిపల్లి నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కోదాడ, మేజర్‌న్యూస్ : కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకున్న 2004-2005 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. రెండు దశాబ్దాల తర్వాత పాఠశాల పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలుసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆనాటి తీపి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను విద్యార్థులు అంతా కలిసి ఘనంగా సన్మానించారు.

**మునగాల :** మునగాల మండలపరిధిలోని నరసింహులగూడెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2004-2005, వరకు పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థిని విద్యార్థులు పాఠశాల ఆవరణంలో సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఎం.వెంకన్న, జి.రమేష్ బాబు, కరుణశ్రీ, ఝాన్సీరాణి, రామాంజమ్మ, ఆర్.బుచ్చిరెడ్డి, ఎం.అంజయ్య, భారతి, రెడ్యానాయక్, లామేరి, అనురాధలను ఆహ్వానించి ఆశీర్వాదం పొందారు, అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయుల విద్యాబోధనను, గుర్తుచేసుకొని వారిని కొనియాడారు. తరువాత ఉపాధ్యాయులను పూలమాల శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు కత్తి నాగరాజు, ఎం.శివ, ఏ.రమేష్, ఆర్.శ్వేత, ఏ.ఇందిరా, శైలజ, మహేశ్వరి, రాజేష్, కిరణ్, అమిద్ పాల్గొన్నారు.



# తెలుగు వెలుగుల షిర్డీ క్షేత్రం చింతపల్లి శ్రీ సాయిసన్నిధి

## 18వ వార్షికోత్సవములకు ఘనంగా ఏర్పాట్లు

### నేటి నుంచి పూజలు ప్రారంభం





చింతపల్లి, మేజర్‌న్యూస్ : చింతపల్లి శ్రీ సాయి సన్నిధిలో 18వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ గుప్తా, కమిటీ సభ్యులు తెలిపారు. మే 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు ముక్కామల పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శ్రీధర స్వామీజీ వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామ శరణ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27వ తేదీ మంగళవారం ఉదయం గణపతి ప్రార్ధన, గోపూజ, అఖండ దీపారాధన, మంత్రపుష్పములు, తీర్ధ ప్రసాద వితరణ, సాయంత్రము అంకురారోహణ, మహా మండప ఆవాహన, అగ్ని ప్రతిష్టాపన, మూలమంత్ర ఆహ్వానములు, నవ కలిశార్చన, ద్వాదశ ఆలాపన, ధ్వజారోహణ, నీరాజన మంత్రపుష్పములు, రాజోపాచారములు, తీర్ధ ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. 28వ తేదీ బుధవారం ఉదయం గవ్యాంత పూజలు ,వాస్తు పూజ, వాస్తు హెూమము, సహస్ర మోదక లక్ష్మీ గణపతి లక్ష్మీ కుబేర సైతం సుదర్శన హెూమములు, హెూమము, నీరాజనం, మంత్రపుష్పములు తీర్ధ ప్రసాద వితరణ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. 29వ తేదీ (గురువారం) ఉదయం 9 గంటలకు "మహా పూర్ణాహుతి" ఉదయం 10 గంటలకు "గోవృషభ కళ్యాణం", ఉదయం 11 గంటలకు తెలంగాణ తిరుమల "స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దివ్య కళ్యాణం", మధ్యాహ్నం "శ్రీ సాయినాథునికి అష్టోత్తర శత కలశాభిషేకం" వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు సభ్యులు కలిపారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ సాయినాథుల వారి పల్లవి సేవ, ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరుపబడును అని వారు తెలిపారు. శ్రీ సాయి సన్నిధి వార్షిక మహెూత్సవానికి విచ్చేస్తున్న ముఖ్య అతిథులు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, నిజామాబాద్ శాసనసభ్యులు సూర్యనారాయణ, శ్రీ గోరక్ష మహదేవ్ గాడిల్కర్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి, శ్రీ సాయి బాబా సంస్థాన్ ట్రస్ట్ షిరిడి, శ్రీ స్వర్ణగిరి దేవాలయ వ్యవస్థాపక చైర్మన్. శ్రీ మానేపల్లి రామారావు విజయలక్ష్మి. అదేవిధంగా ప్రతిరోజు నారాయణ సేవ పేర్న మహా అన్న ప్రసాదం, రాత్రి అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ మంచికంటి ధనంజయ గుప్తా, ట్రస్ట్ సభ్యులు వెంకటయ్య, ఊరే కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమల్ల శ్రీనివాస్ అన్నారు.

# స్పటిక లింగానికి పూజలు

యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో సోమవారం వేకువ జామున సుప్రభాతంతో మొదలై నిత్యారాధనలతోపాటు ప్రత్యేక అర్చనలు చేపట్టారు. ఆర్జిత సేవ రాత్రి ప్రతిష్ట మూర్తులకు ఆరాధన సహస్రనామార్చన నిర్వహించారు. అనుబంధంగా కొనసాగుతున్న మందిరంలో రామలింగేశ్వరుని కొలుస్తూ అభిషేకం అర్చనలు, రుద్రహెూమం నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో లక్ష్మీ నరసింహ స్వామిని ఆరాధిస్తూ నిత్య ఆరాధనతో పాటు కళ్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటల 30 నిమిషాలకు అర్చన రాత్రి ఎనిమిది గంటల పదిహేను నిమిషాలకు దర్శనాలు ప్రారంభం 9 గంటలకు ఆగింపు అనగా నివేదన తదుపరి ద్వారబంధన.



## జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన ఏజీఆర్



వలిగొండ, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని వెల్వర్తి గ్రామానికి చెందిన నిజం రిపోర్టర్ కూచిమల్ల నాగేష్ మాతృమూర్తి కూచి మల్ల లక్ష్మమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న ఏజీఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సౌజన్యంతో సమకూర్చిన 10000 రూపాయలను వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు వారి కుటుంబానికి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మారగోని శ్రీనివాస్ గౌడ్, అధ్యక్షులు బాలగోని హనుమంత్ గౌడ్, సభ్యులు బోడిగే సుదర్శన్ గౌడ్, రెబ్బ కుమారస్వామి, బలుగూరి వెంకట్ రెడ్డిదేశ, దేశబోయిన కృష్ణ స్వామి, నీలం నరేందర్, సంగిశెట్టి విజయ్ కుమార్, దంతూరి నరేష్, మార్కా భగవంతు, వీసం రాజు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువుల పై అవగాహన సదస్సు

### నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని లైసెన్స్ ఉన్న డీలర్ వద్దనే కొనండి



హాలియా, మేజర్‌న్యూస్ : అనుముల మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలోని రైతు వేదికలో మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో కిసాన్ సంగోష్టి పిఎం ప్రణాం పథకంలో భాగంగా సేంద్రియ ఎరువుల వాడకం పై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి మండల వ్యవసాయ అధికారి సరిత హాజరై మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వాడి భూసారాన్నిపెంచుకోవాలని రసాయనిక ఎరువులను వాడడం వల్ల ప్రతి ఏటా భూసారం తగ్గిపోతోందని దీంతో రాబోయే రెండు, మూడు తరాల్లో వ్యవసాయానికి ఉపయోగపడే భూమి ఎక్కడా లేకుండా పోతుందని అప్పుడు తిండి గింజలు కూడా దొరకడం కష్టమవుతుందని అన్నారు. భూసారాన్ని పరిరక్షించుకోవాలంటే కృత్రిమ రసాయన ఎరువుల వాడకాన్ని దశలవారీగా పూర్తిగా తగ్గించుకోవాలన్నారు.మన పూర్వీకులు ఆచరించిన సాంప్రదాయ సేంద్రీయ ఎరువులను వాడితే భూసారంని కాపాడుకోవడంతో పాటు పంట దిగుబడి సైతం ఊహించని రీతిలో పెరుగుతుందని అన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో పండించిన పంట ఉత్పత్తులను భుజించడం వల్ల ఆరోగ్యాలు సైతం మెరుగుపడతాయని, ఆసుపత్రి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్క పౌరుడు ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారని ఇందుకు రసాయన ఎరువులతో కూడిన పంట ఉత్పత్తులను తినడం వల్లనే ఈ అనారోగ్యాలు వస్తున్నాయని అన్నారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, గ్రీన్ మ్యానూర్ నుఎక్కువ వినియోగిస్తే నేలలో భూసారం పెరుగుతుంది అని సూచించారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకొని రైతు గుర్తింపు కార్డు పొందాలని దీనికి గాను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని ఫార్మర్ రిజిస్ట్రీ చివరి తేదీ మే 31, దీని వల్ల కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ది చేకూరుతుందని, కాటన్ సీడ్ కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని, నకిలీ విత్తనాలు కొని మోసపోకూడదని, లైసెన్స్ వున్న డీలర్ల వద్ద మాత్రమే పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తన కొనుగోలు బిల్ను సీజన్ అయ్యేవరకు జాగ్రత్తగా పెట్టుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మద్రాస్ ఫర్టిలైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ – మిర్యాలగూడ రామ రావు మాట్లాడుతూ రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా ఉన్నటువంటి సేంద్రియ ఎరువుల గూర్చి వివరించడం జరిగింది. ఏఇఓ నాగయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని

## సర్వేయర్లు సద్వినియోగం చేసుకోవాలి

### – కలెక్టర్ హనుమంతరావు




భువనగిరి, మేజర్‌న్యూస్ : భువనగిరి పట్టణంలోని వెన్నెల కళాశాల లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొదటి రోజు శిక్షణ కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమానికి 198 మంది సర్వేయర్లు పాల్గొంటున్నారని, వీరిని మొత్తం 10బ్యాచ్‌లుగా చేసి రెండు బ్యాచిలుగా థియరీకి, 8 బ్యాచిలు క్షేత్ర స్థాయిగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిక్షణా కార్యక్రమం 50 రోజుల పని దినాలు జరుగుతాయన్నారు. శిక్షణలో భాగంగా సర్వేలో 35 సెక్షన్లు ఉంటాయని వాటికి సంబంధించినవి అన్ని చదివి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అట్టి వాటికి సంబంధించిన వాల్యూంలను జాగ్రత్తగా చదవాలన్నారు. ముఖ్యంగా సర్వేలు ఫీల్డ్ ట్రాకింగ్ చాలా కీలక మైనదని, ఫీల్డ్‌లో భాగంగా రకరకాల భూములను సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. సర్వే అనేది జీవితంలో ఒక స్కిన్ లాంటిదని, భూమి సర్వే చేసేటప్పుడు రక రకాలుగా(వంకర టింకరగా) భూమి కొలత ఉంటుందని దానికి అనుగుణంగా రెక్టాంగిల్, స్క్వేర్ లేదా ట్రయాంగిల్ ఆకారాలను ఉపయోగిస్తూ భూమి సర్వేను సులభంగా చేయవచ్చన్నారు. అనంతరం సర్వేకు సంబంధించిన మెటీరియల్‌ను శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ హనుమంతరావు అందజేశారు. శిక్షణ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి వేణుగోపాల్ రెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

## బాలసదనం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు

### – కలెక్టర్ హనుమంతరావు



భువనగిరి, మేజర్‌న్యూస్ : సోమవారం గ్రీవెన్స్ డే పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి 40 విజ్ఞప్తులు ఫిర్యాదులు స్వీకరించారు.అందులో కొన్ని ఇలా ఉన్నాయి. భువనగిరి జిల్లాకు చెందిన బాలల హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు కొడారి వెంకటేష్ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు అందిస్తూ జిల్లాలో ఉన్న బాలసదనం మన సమస్యలతో అస్తవ్యస్తంగా ఉందని సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తిని అందించారు. బీబీనగర్ మండలం మహాదేవపూర్‌కు చెందిన వేణుగోపాల స్వామి టెంపుల్ చైర్మన్ శివారెడ్డి దరఖాస్తు అందిస్తూ ఈ ఆలయం అత్యంత పురాతనమైనదని భక్తుల రాకకు కెమికల్ కంపెనీ విడుదల చేసే నీరు, గాలి అసౌకర్యం కలిగిస్తున్నాయని తగు చర్యలు తీసుకోవాలని ఆలయ చైర్మన్ శివారెడ్డి తో పాటు ప్రభాకర్, స్వామి రెడ్డి, ఆంజనేయులు, పద్మారెడ్డి, కరుణాకర్ రెడ్డి, అఖిల్, రాములు విజ్ఞాపన అందజేశారు. మోట కొండూరు మండలం సింగారం గ్రామానికి చెందిన పన్నాల అనూష దరఖాస్తు అందిస్తూ సర్వే నెంబర్లు 215/1, 215/5, 212/1, 214/1, 214/4లలో 14 ఎకరాల భూమి ఉందని, సర్వే కొరకు చాలానా కూడా కట్టి నాలుగు సంవత్సరంల అయిందని ఆయన ఇప్పటివరకు సర్వే చేయడానికి రావడం లేదన్నారు.పోచంపల్లి మండలం జిబ్లగ్‌పల్లికి చెందిన సయ్యద్ సుల్తానా భర్త చాంద్ పాషా తన దరఖాస్తు అందిస్తూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినా ముగ్గు పోయడానికి రాలేదని తమకు కారణాలు తెలియవని తగు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డుకు చెందిన ఎడ్ల నరసమ్మ దరఖాస్తు అందిస్తూ తనకు అర్హత ఉన్న ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పర్యవేక్షించాలని, వెంటనే సమాధానం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈవో శోభారాణి, డిఆర్‌డిఓ నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిని సునంద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### విద్యుత్ కార్మికుల సమస్య పరిష్కారానికి

## 1104 యూనియన్ ముందంజ



చండూర్, మేజర్‌న్యూస్ : తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో చండూర్ సబ్ స్టేషన్ ఆవరణలో సోమవారం మేడేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎన్.వెంకటయ్య మేడే జండాను ఆవిష్కరించినారు. అనంతరం ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా 1104 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా కార్యదర్శి ఎన్.వెంకటయ్య హాజరై మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా నిరంతరం విద్యుత్ కార్మికుల సమస్యలపై పోరాడే ఏకైక యూనియన్ 1104 యూనియన్‌దే అని అలాగే సంస్థలో విద్యుత్ కార్మికులు నిరంతరం కష్టపడి 24 గంటలు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారని, ఆర్టిజన్ కార్మికులకు గ్రేడ్‌ల వారీగా ప్రమోషన్లు కల్పించాలని, విద్యుత్ కనెక్షన్ల సంఖ్య పెరిగి లైన్ మెన్‌లపై అధిక పని భారం పడుతుందని క్షేత్రస్థాయిలో జూనియర్ లైన్మెన్‌ల పోస్టులు భర్తీ చేసి పని భారం తగ్గించాలని, విద్యుత్ సంస్థలో పని చేస్తున్నటువంటి కార్మికులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. అనంతరం ఇతర యూనియన్ నుండి 1104 యూనియన్‌కి ఆకర్షితులై జిల్లా కార్యదర్శి వెంకటయ్య సమక్షంలో రాములు జాయిన్ ఐనాడు ఇట్టి కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కార్య నిర్వహణ అధ్యక్షులు, డివిజన్ కార్యదర్శి టి.శ్రీనివాసులు, డివిజన్ అధ్యక్షులు రాంబాబు, డివిజన్ అదనపు కార్యదర్శి ఆర్.బాలు నాయక్, డివిజన్ జాయింట్ కార్యదర్శి అయూబ్, డిస్కం ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.ముత్తయ్య, డివిజన్ కోశాధికారి యం.డి.షరీఫ్ పాష, చండూర్ సెక్షన్ లీడర్ షజ్జు పాష, ఎల్లేశం, ముత్యంరెడ్డి, దోటి శ్రీను, చంద్రమౌళి, వంగూరివెంకన్న, సైదులు, యాసిన్, పరమేష్, హరిలాల్, రమేష్, నర్సింహా, సురేష్, ఆంజనేయులు, రామక్రిష్ణ, బీమా అర్జున్, మధు తదితరులు పాల్గొన్నారు.

## మే 31న చలో హైదరాబాద్

### టిజెఎఫ్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 21న మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీజేఎఫ్ వ్యవస్థాపకులు అల్లం నారాయణ సార్ ఆధ్వర్యంలో ఈ నెల 31న హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహిస్తున్న రజతోత్సవ సభను విజయవంతం చేయడానికి యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని టిడబ్ల్యూజేయు జిల్లా అధ్యక్షులు జూకంటి అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుడుక రామకృష్ణలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో ఆనాటి సీనియర్ పాత్రికేయులు గౌరవ అల్లం నారాయణ సార్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుండి జర్నలిస్టులంత ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తు చేశారు. ఆనాడు ఏర్పడిన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం 25వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా గౌరవ అల్లం నారాయణ సార్ గారి నాయకత్వంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ సభను హైదరాబాద్ జల విహార్ ఆడిటోరియంలో మే 31 2025న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నారని, ఈ సభను విజయవంతం చేయవలసిందిగా జిల్లా జర్నలిస్ట్ లను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కేతావత్ తిరుపతి నాయక్, బూడిద శ్రీహరి, ఆలేరు మండల గౌరవ అధ్యక్షులు జూల శ్రీధర్. ఆలేరు మండల అధ్యక్షుడు గుండు మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అరె భానుప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి దడిగే రమేష్, సీనియర్ జర్నలిస్టు మల్లిగారి శ్రీనివాస్ సీస సాయిరాం, చెన్రాజు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

